క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



ప్రజలకు మజ్జిగ అందజేస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వర్తక సంఘం ఆధ్వర్యంలో, అక్కిరెడ్డిపాలెం ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నగర ప్రధాన కార్యదర్శి సంద్రాన నూకరాజులు సోమవారం ప్రారంభించారు. ఈ చలివేంద్రంలో మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లతీష్ మాట్లాడుతూ వర్తక సంఘం వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు వర్తకులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డులు ప్రకటించాలి

అగనంపూడి: విశిష్ట సేవలు అందించిన కార్మికులకు కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డులు ప్రకటించాలని టీఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించిన సమావేశంలో కె.నాగార్జున, బి.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులు ఉన్నారన్నారు. వీరి శ్రమను గుర్తించి అవార్డులు ప్రకటించడం ద్వారా నూతనోత్తేజాన్ని కల్గించాలని కోరారు. కార్యక్రమంలో డి.రమేష్, టి.శ్రీనివాసరావు, ఎం.నరసింగరావు పాల్గొన్నారు.

ఘనంగా పెంటమాంబ మారువారం పండగ



పూజలందుకున్న అమ్మవారు

పెదగంట్యాడ: నెల్లిముక్కు 14 గ్రామాల ఆరాధ్యదేవత పెంటమాంబ అమ్మవారి మారువారం పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బోగాదికి నియామక పత్రం అందజేత



ఎండీ వీరపాండియన్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న బోగాది

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా వైఎస్సార్‌సీపీ 69వ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు సోమవారం నియామక పత్రం అందుకున్నారు. అమరావతిలోని సచివాలయంలో కార్పొరేషన్ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండియన్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం సన్యాసిరావు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో కలిసి, కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ పూజ లో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

బస్టాప్‌లో ప్రైవేట్ కార్ల దందా

- దూర ప్రాంత ప్రయాణికులను టార్గెట్ చేస్తున్న వైట్‌బోర్డు కారు డ్రైవర్లు
- బస్‌స్టాప్ వద్దే అనధికార పార్కింగ్
- ఆర్టీసీ ఆదాయానికి గండి



గాజువాకలో నర్సీపట్నం బస్టాండ్ వద్ద ప్రయాణికుడిని ఎక్కించుకొంటున్న ప్రైవేట్ కారు



బస్‌స్టాప్‌లోనే పార్కు చేసిన కార్లు

గాజువాక: ఆర్టీసీ ఆదాయానికి వైట్ బోర్డు కారు డ్రైవర్లు గండి కొడుతున్నారు. బస్ స్టాప్ వద్దనే ప్రయాణికులను తమ కార్లలో ఎక్కించుకొని వెళ్లిపోతున్నారు. కొన్నిసార్లు బస్ ఎక్కుదామనుకున్న ప్రయాణికులను కూడా త్వరగా తీసుకెళ్లిపోతామంటూ తొందరపెట్టి ఎక్కించుకుంటున్నారు. పాతగాజువాక జంక్షన్‌లోని ఆర్టీసీ బస్‌స్టాప్‌లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. నర్సీపట్నం, ఎలమంచిలి, తుని, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల కోసం పాతగాజువాక జంక్షన్‌లో బస్‌స్టాప్ ఉంది. ఆయా బస్సుల్లో ప్రయాణాల కోసం ఇక్కడ ఆర్టీసీ బస్ టిక్కెట్ల రిజర్వేషన్ కౌంటర్ కూడా ఉంది. ఈ స్టాప్ దగ్గర బస్సుల కంటే ముందుగా వైట్ బోర్డు కార్లు ఆగి ఉంటున్నాయి. బస్సు రావడానికి కొద్ది సమయం ముందు బస్‌స్టాప్‌లోనే తిష్ట వేసి ప్రయాణికులను ఎక్కించుకొంటున్నారు. కారులో ఏసీ ప్రయాణమంటూ ప్రయాణికులను ప్రోత్సహించి, తమ కార్లలో ఎక్కించుకుపోతున్నారు. ఇష్టం వచ్చిన రేట్లతో ప్రయాణికుల వద్ద దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఎక్కడివీ కార్లు?

నర్సీపట్నం, ఎలమంచిలి, తుని, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం వంటి దూర ప్రాంతాల నుంచి కారు ఓనర్లు వివిధ పనుల నిమిత్తం విశాఖకు వస్తుంటారు. ఇక్కడ కొద్దిరోజుల పాటు ఉండాల్సిన ఉన్నవారు, విమానాల్లో ప్రయాణాలున్నవారు తమ కార్లను డ్రైవర్లతో పంపించేస్తుంటారు. దీంతో ఆయా కార్ల డ్రైవర్లు పాతగాజువాకలోని ఆర్టీసీ ప్రయాణికులను తమ వైపు తిప్పుకొని ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. వైట్ బోర్డు కార్లను ట్యాక్సీలుగా ఉపయోగించే వీలు లేనప్పటికీ సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో వారు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు

దీనిపై దృష్టి సారించాం. అనధికారికంగా కార్లను ఆపి ప్రయాణికులను ఎక్కించుకొంటున్నారని పోలీసులకు కూడా ఫిర్యాదు ఇవ్వాలని నిర్ణయించాం. మా సిబ్బంది బస్టాప్‌లో ఉన్నంతసేపు ప్రైవేటు కార్లను అడ్డుకొంటున్నాం. మేము అక్కడి నుంచి వెళ్లిపోతే మళ్లీ కార్లను పెట్టేస్తున్నారు. ఈసారి సీరియస్‌గానే చర్యలు తీసుకొంటాం.

– ప్రవీణ, గాజువాక డిపో మేనేజర్

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



పాఠశాలలో నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్

పెదగంట్యాడ: అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక దళ జిల్లా సహాయ అధికారి ఆర్.వెంకటరమణ, ఇన్‌చార్జి అతధికారి పి.నాగేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. అగ్నిమాపక దళ వారోత్సవాల్లో భాగంగా సిద్ధేశ్వరంలోని రాజీవ్ విద్యానికేతన్ పాఠశాలలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో చేసి చూపించారు. మంటలు వ్యాపించకుండా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పాఠశాలల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పెదగంట్యాడ అగ్నిమాపక దళ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షునిగా మళ్ల



జగదీశ్వరరావు

ఉక్కునగరం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ ఉపాధ్యక్షునిగా మళ్ల జగదీశ్వరరావు ఎన్నికయ్యారు. బీహార్ రాజధాని పాట్నాలో గత వారం జరిగిన బీఎంఎస్ 20వ త్రైవార్షిక మహాసభలకు దేశ వ్యాప్తంగా జాతీయ పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర స్థాయి పదాధికారులు, కార్యవర్గ సభ్యులు సుమారు 2200 మంది హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరిగిన కార్యవర్గ సమావేశాల్లో దేశంలోని కార్మిక సమస్యలు, జాతీయ సమస్యలపై చర్చలు జరిగాయి. అనంతరం మూడేళ్ల కాలపరిమితితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో మళ్ల జగదీశ్వరరావును మూడో సారి జాతీయ ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను బీఎంఎస్ నాయకులు ఎం.వి.ఎస్. నాయుడు, రాందాస్ నరేంద్ర, లాలం ప్రసాద్, రొక్కం సురేష్‌కుమార్, ఎస్.ఆర్.సి. శేఖర్ అభినందించారు.

795వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 795వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్–1 విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడం తప్పదని కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ఆ ప్రకటనలకు బెదిరేది లేదన్నారు. పోరాటం చేయడం ద్వారా ఉక్కు కార్మికుల పోరాట శక్తి దేశానికి తెలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

వాహనం ఢీ కొని యాచకుడు మృతి



యాచకుడి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మతిస్థిమితం లేని ఓ యాచకుడు(40) మృతి చెందాడు. ఘటనకు సంబంధించి గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో తిరిగే మతిస్థిమితం లేని యాచకుడిని ఆటోనగర్ బీ బ్లాక్‌లో సోమవారం ఉదయం ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని, నడుము పైనుంచి దూసుకుపోయింది. ప్రమాదంలో యాచకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. యాచకుడు ఒంటిపై టవల్ మాత్రమే కట్టుకొని సంచరిస్తుంటాడని స్థానికులు తెలిపారు. ఒడిశా ప్రాంతానికి చెందిన వాడిగా భావిస్తున్నామన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తు పడితే, గాజువాక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత పెదగంట్యాడ జట్టు



విజేతలకు కప్ అందిస్తున్న రుషికేష్

పెదగంట్యాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి చెల్లి రుషికేష్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో పెదగంట్యాడ జట్టు విజేతగా నిలిచింది. మల్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని పెదగంట్యాడలో నిర్వహించిన ఈ టోర్నమెంటులో మల్కాపురం, ఆటోనగర్, వడ్లపూడి, పెదగంట్యాడ, శ్రీహరిపురం, గాజువాక కార్యాలయాల నుంచి మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీల్లో పెదగంట్యాడ, మల్కాపురం జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన పెదగంట్యాడ జట్టు 8 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 78 పరుగులు చేయగా, 79 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన మల్కాపురం జట్టు 36 పరుగులకే ఆలౌట్ అయింది. విజేత జట్టుకు రుషికేష్ సోమవారం కప్‌ను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పెదగంట్యాడ టౌన్ ఏఈ భాను, ఆరు సెక్షన్ల సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ మార్గంలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు యువకులకు గాయాలు



తీవ్రంగా గాయపడిన యువకుడు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఇద్దరు యువకులు ఆదివారం బైక్‌పై వస్తుండగా శ్రీచైతన్య జూనియర్ కళాశాల వద్దకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. వారిద్దరూ బైక్ నుంచి కింద పడడంతో గాయాలయ్యాయి. వారిరువురు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పిల్లలని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్‌కు చెందిన కానిస్టేబుల్ భార్య ఎస్. భారతి కనిపించటం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్‌లో కాసుబాబు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాసుబాబు తన కుటుంబంతో సెక్టార్–9లోని క్వార్టర్‌లో నివసిస్తున్నారు. వారికి 13 ఏళ్ల క్రితం పెళ్లయింది. బాబు, పాప ఉన్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు కాసుబాబు విధులకు వెళ్లారు. అనంతరం పిల్లలు నిద్ర లేవక ముందే ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. చుట్టుపక్కల వెదికినా కనిపించకపోవటంతో రాత్రి స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె తండ్రి దేముళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై ద్వంద్వ వైఖరి తగదు



నరసింహనగర్ కూడలిలో ధర్నా చేస్తున్న వామనమూర్తి, ఇతర నాయకులు

సీతంపేట: కేంద్ర ఉక్కు సహాయక మంత్రి ఫగాన్ సింగ్ కులస్తే ద్వంద్వ వైఖరి విడనాడాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నరసింహనగర్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలిపివేస్తామని, ప్లాంట్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ప్రకటించిన కేంద్ర మంత్రి.. సాయంత్రమయ్యే సరికి మాట మార్చేశారని మండిపడ్డారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అని రెండేళ్లుగా చేస్తున్న నిరసనలు, ధర్నాలను విచ్ఛిన్నం చేయడానికే ఫగాన్ సింగ్ అటువంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, ఐరన్‌ఓర్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, కేలం శివ, కె.శ్రీను, పి.సాయికుమార్, జి.సూర్యారావు, డి.మహాలక్ష్మినాయుడు, బి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న శ్రీశ్రీపై క్విజ్ పోటీ

సీతంపేట: శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఈ నెల 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శ్రీశ్రీ జీవితం, సమగ్ర సాహిత్యంపై క్విజ్ పోటీ నిర్వహించనున్నట్టు విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష ఉంటుందని, వన్ వర్డ్ ఆన్సర్స్ రూపంలో రాయాల్సి ఉంటుందన్నారు. 30 ఏళ్లలోపు వారు(జూనియర్స్) ఒక విభాగంగా, ఆపై వయస్సు ఉన్నవారు (సీనియర్స్) మరో విభాగంగా పోటీ జరుగుతుందని చెప్పారు. రెండు విభాగాలకు విడివిడిగా ప్రథమ బహుమతి రూ.1,000, ద్వితీయ బహుమతి రూ.750 ప్రదానం చేస్తామన్నారు. ఈ నెల 30న అంకోశాలో జరగనున్న శ్రీశ్రీ జయంతి వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొన దలచిన వారు వారి పేర్లను వాట్సాప్ ద్వారా ఈ నెల 20లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు 98851 88431, మేడా మస్తాన్‌రెడ్డి 94413 44365 నంబర్లకు వాట్సాప్ చేయాలని కోరారు.

రోల్ మోడల్‌గా యువత నిలవాలి



ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భవిష్యత్తు తరానికి ప్రస్తుత యువత రోల్‌మోడల్‌గా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన ఐఏఎస్ఈ ఫ్రెషర్స్‌డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులుగా మీరంతా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు వీసీ బహుమతులు అందజేశారు.

ప్రజా పోరాటాలతో కేంద్రానికి గుణపాఠం



ప్రచారంలో ప్రసంగిస్తున్న సత్యనారాయణ

గాజువాక: ప్రజా పోరాటాలతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి ప్రజలు ముందుకు రావాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ప్రచార భేరి పాదయాత్ర సందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు దుర్గానగర్, సుందరయ్య కాలనీలలో సోమవారం ప్రచారం చేశారు. సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విధానాలను నిరసించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలవల్లే ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ధరలను తగ్గించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్మికవర్గాన్ని రోడ్డున పడేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంలేదని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు అప్పారి విష్ణుమూర్తి, గంగాధరరావు, డి.శ్రీనివాసరావు, ఎం.తాతాబాబు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి'

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. పెదగంట్యాడ జంక్షన్ నుంచి నెల్లిముక్కు మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీలో పెంటమాంబ అమ్మవారి ఆలయం వరకు సోమవారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా ఆదరణ



87వ వార్డులో కరపత్రాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రశాంతినగర్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ఇంటింటా ఆదరణ లభిస్తోంది. జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదేశాలతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి వార్డులోని ప్రతీ ఇంటిని సందర్శించారు. గత ప్రభుత్వం కంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా మెరుగైన పాలనను అందించిందో వివరించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఇంటి గోడపై 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. ప్రభుత్వ సుపరిపాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి రమాదేవి, శృంగవరపు బ్రాహ్మణి, గాలి రమణమ్మ, వర్రె రాజు, రమణ ఇతర నాయకులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి ప్రశాంతినగర్ వార్డు సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించారు. మూడున్నరేళ్లలో చేపట్టిన ప్రభుత్వ పథకాలను వివరించారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు గుర్రం శ్రీను, జెర్రిపోతుల సమర, సోమునాయుడు, మామిడి శ్రీను, రాము, తమ్మిన శ్రీహర్ష, నెల్లి శ్రీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున రాజుకు చలమాజీ పురస్కారం



చరపాక నాగార్జున రాజుకు అవార్డు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశేష సేవలందించిన సేవా తత్పరుడు, నాతయ్యపాలేనికి చెందిన చరపాక నాగార్జునకు చలమాజీ రాష్ట్ర స్థాయి ఆత్మీయ లెజెండరీ అవార్డు 2023ను అందజేశారు. గాజువాకలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు మాట్లాడుతూ ఇప్పటికే నాగార్జున రాజు వివిధ రంగాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారని, సేవా రంగంలో డాక్టరేట్ పొందారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు మెంబర్ భాస్కర అయ్యల నాయుడు, గాజువాక శాంతిభద్రతల సీఐ ఎల్.భాస్కరరావు, బీజేపీ నాయకులు కె.నర్సింగరావు, బాటా శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకురాలు కమరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

విజయకుమార్‌కు జగ్జీవన్‌రామ్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయ్‌కుమార్

అగనంపూడి: సామాజిక కార్యకర్త, యునైటెడ్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ నేషనల్ వైస్ చైర్మన్ జొన్నకూటి విజయ్‌కుమార్‌ను బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు, బాబూ జగ్జీవన్‌రామ్ నేషనల్ ఫెలోషిప్ అవార్డులు వరించాయి. ఫిలంత్రోపిక్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయ్‌కుమార్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫిలంత్రోపిక్ సొసైటీ ఫౌండర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాల గంగాధర్ తిలక్, వలంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్ మేదర సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి

- అధికారులకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సూచన
- 13వ వార్డులో విస్తృత పర్యటన



లక్ష్మీనగర్‌లో గెడ్డలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ శానిటరీ విభాగం అధికారులకు సూచించారు. జీవీఎంసీ 13వ వార్డు పరిధి లక్ష్మీనగర్, ఎర్నిదుర్గానగర్ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో గెడ్డలు, కాలువలు, రోడ్లు పరిశీలించారు. ఎర్నిదుర్గానగర్, లక్ష్మీనగర్ మధ్య కాలువ గోడలు శిథిలావస్థకు చేరడం, ఆ గెడ్డలో స్థానికులు పాలిథిన్ కవర్లతో మూటలు కట్టి పడేసిన చెత్త పేరుకుపోవడాన్ని ఆయన గమనించారు. దీనిలో చెత్త వంటనే తొలగించి శుభ్రం చేయించాలని స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న గెడ్డ గోడల నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. దీనిలో స్థానికులు చెత్త వేయకుండా అవగాహన కల్పించి, నియంత్రించాలని చెప్పారు. అనంతరం స్థానికులతో ఆయన మాట్లాడి తడి, పొడి చెత్త వేర్వేరుగా అందజేసి పారిశుధ్య కార్మికులకు సహకరించాలని సూచించారు. అనంతరం ముడసర్లోవ వద్ద డంపింగ్‌యార్డును సందర్శించారు. ఇక్కడ రోజుకు ఎన్ని టన్నులు చెత్త వస్తుంది, ఈ చెత్త ఎక్కడికి తరలిస్తున్నారు, ఇళ్ల నుంచి చెత్తను సేకరించడానికి ఎన్ని వాహనాలు ఉన్నాయి.. తదితర అంశాల గురించి సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ కెల్ల సునీత, అడిషనల్ కమిషనర్ వి.సన్యాసిరావు, జెడ్సీ కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం నేడు

బీచ్ రోడ్డు: ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాటర్ పెయింటింగ్ చిత్రాల ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభం కానుందని హవా మహల్ రాజమాత మయంక్ కుమారి దేవి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్టిస్ట్ నరేష్ మహంతి గీసిన చిత్రాలను షేడ్స్ ఆఫ్ వైజాగ్ పేరుతో ఈ నెల 20 వరకు ప్రదర్శించనున్నట్టు తెలిపారు.